మన కరెంట్ కర్ణాటకకు?!

2019లో ఒకే ఒక్క ఒప్పందంతో ఛత్తీస్‌గఢ్‌ను విద్యుత్తు సంక్షోభంలోకి నెట్టేసింది కాంగ్రెస్. రాజస్థాన్ అవసరాలు తీర్చేందుకు ఛత్తీస్‌గఢ్‌ని బలిపెట్టింది. 2022లో అదే రాజస్థాన్ కరెంటు కరువు తీర్చేందుకు హిమాచల్‌ప్రదేశ్‌ను బలవంతంగా ఒప్పందంలోకి దించింది.ఆ తర్వాత హిమాచల్‌లోనూ కరెంటు కోతలు మొదలయ్యాయి. రాష్ట్రాల మధ్య కరెంటు తాకులాటలు పెట్టడం కాంగ్రెస్‌కు కొత్తకాదని, తనకు అక్కరకొచ్చే పెద్ద రాష్ట్రాల కోసం ఇతర రాష్ట్రాలను బలిపెట్టే దాని ధోరణికి ఉదాహరణలెన్నో ఉన్నాయని విద్యుత్తురంగ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం కర్ణాటకలో కరెంటు కోతలు తీవ్రమైన దశలో.. పక్కన తెలంగాణ పచ్చగా కనబడుతున్నది. 24 గంటల కరెంటుతో కళకళలాడుతుండటం కాంగ్రెస్‌ను ఊరిస్తున్నది. తెలంగాణను 5 గంటల కరెంటుకే కట్టడిచేసి.. ఆ దిశగా ప్రజల ఆలోచనను పరిమితం చేయాలని ప్రయత్నిస్తున్నది. కటకటాల కర్ణాటకకు వడ్డించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నది. కళకళలాడుతున్న తెలంగాణను అందుకు బలిపెట్టబోతున్నది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): పదేండ్ల కిందట కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ఎట్లుండె? ఎక్కడ చూసినా విద్యుత్తు కోతలే! గ్రామాల్లో 16 గంటలు, మండల కేంద్రాల్లో 12 గంటలు, జిల్లా కేంద్రాల్లో 10 గంటలు, రాజధాని హైదరాబాద్‌లో ఆరేడు గంటలపాటు కరెంటు పోయేది. పరిశ్రమలకు వారానికి రెండ్రోజులు పవర్ హాలిడేలు. సాగుకు 3 గంటల విద్యుత్తు ఇస్తే ఎక్కువ. అయితే, తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్‌పాలనలో తెలంగాణ స్థితిగతులే మారిపోయాయి. అన్నిరంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరుగుతున్నది. అయితే, మరికొద్ది రోజుల్లో ఆ పరిస్థితులు ఉండకపోవచ్చు. వచ్చే ఎన్నికల్లో ఏమాత్రం ఆదమరిచి కాంగ్రెస్‌కు ఓటేసినా.. పదేండ్లకిందటి విద్యుత్తు కోతలే మళ్లీ దాపురించవచ్చు. మన కరెంటు పొరుగు రాష్ట్రం కర్ణాటకకు తరలిపోవచ్చు.

తలసరి విద్యుత్తు వినియోగంలో తెలంగాణదే రికార్డు

దేశంలో తలసరి విద్యుత్తు వినియోగం	1,255 యూనిట్లు
కర్ణాటక తలసరి విద్యుత్తు వినియోగం	1,184 యూనిట్లు
తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం	2,166 యూనిట్లు

విద్యుత్తు కోతలతో కర్ణాటక కకావికలం

కాంగ్రెస్‌పాలనలో కర్ణాటక అస్తవ్యస్థంగా మారింది. విద్యుత్తు కోతలతో ప్రజలు, రైతులు, పారిశ్రామికవేత్తలు సతమతమవుతున్నారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు తగినంత విద్యుత్తు సరఫరా చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కోతలకు తెగబడుతున్నది. ఐదు గ్యారంటీల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పేరిట తీసుకొచ్చిన 'గృహజ్యోతి' స్కీమ్ ఎప్పుడో అటకెక్కింది. రాష్ట్రవ్యాప్తంగా 2.14 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తుందని అనుకున్న ఈ స్కీమ్.. కాంగ్రెస్ పెడుతున్న కొర్రీల కారణంగా కేవలం 8 లక్షల మందికే పరిమితమయ్యే ప్రమాదం ఏర్పడింది. రైతులకు సరిపడా విద్యుత్తు సరఫరా చేస్తామన్న కాంగ్రెస్.. 5 గంటల కరెంట్ కూడా ఇవ్వలేక చేతులెత్తేసింది. విద్యుత్తు కోతల కారణంగా పరిశ్రమలకు పవర్ హాలీడేలు ఇస్తున్నారు. కేవలం ఆరంటే ఆరునెలల్లోనే కర్ణాటకను విద్యుత్తు సంక్షోభంలోకి నడిపించిన కాంగ్రెస్.. ఇప్పుడు తెలంగాణవైపు చూస్తున్నది. లోపభూయిష్టమైన విద్యుత్తు ఒప్పందాలతో మిగులు విద్యుత్తు కలిగిన ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలను కరెంటు ఒప్పందాలతో చీకట్లలోకి నెట్టేసిన కాంగ్రెస్ ఇప్పుడు తెలంగాణపై కన్నేసింది. ఇక్కడి కరెంటును కర్ణాటకకు తరలించేలా విద్యుత్తు సరఫరా ఒప్పందాన్ని తీసుకురావాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ, అదే జరిగితే కర్ణాటకలాగే తెలంగాణ కూడా ఆగమవడం ఖాయమని తెలంగాణవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే, తెలంగాణ చీకట్లోకి వెళ్లిపోవడం ఖాయమని వారు హెచ్చరిస్తున్నారు.

అంతటా అంధకారమే

ఒక రాష్ట్రాన్ని ఆదుకొంటున్నామన్న ముసుగులో మరో రాష్ట్రాన్ని కూడా ఊబిలోకి తోసేయడం కాంగ్రెస్‌కు అలవాటేనన్నది మొదటినుంచీ ఉన్న విమర్శే. అప్పటికే పీకల్లోతు విద్యుత్తు సంక్షోభంలో ఉన్న రాజస్థాన్‌ను ఆదుకొంటున్నామన్న సాకుతో 2019లో మిగులు విద్యుత్తు ఉన్న ఛత్తీస్‌గఢ్, 2023లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలతో కాంగ్రెస్ లోపాయికారి విద్యుత్తు సరఫరా ఒప్పందాలను కుదుర్చుకొన్నది. తొలిదఫాలో వెయ్యి మెగావాట్లతో మొదలుపెట్టి క్రమంగా పలు దఫాల్లో 2,500 మెగావాట్ల వరకూ ఒప్పందాన్ని సవరించింది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ఆ పార్టీనే అధికారంలో ఉండటంతో పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. అయితే, తమ విద్యుత్తును తీసుకెళ్లొద్దంటూ ఛత్తీస్‌గఢ్, హిమాచల్ హక్కుల కార్యకర్తలు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఎన్నో విజ్ఞప్తులు చేశారు. అయినా సర్కారు పట్టించుకోలేదు. పైగా ఖజానాకు అదనపు ఆదాయం సమకూరడం ఇష్టంలేనివారే ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తారని ఎదురుదాడికి దిగింది. ఫలితంగా రాజస్థాన్‌లో కరెంటు కష్టాలు తీరడం అటుంచితే.. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌లోనూ విద్యుత్తు కోతలు మొదలయ్యాయి. పక్క రాష్ట్రాల నుంచి విద్యుత్తు కొనుగోళ్లు జరిగినప్పటికీ.. రాజస్థాన్‌లో కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. రాజధాని జైపూర్ సహా ప్రధాన నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్తు కోతలు నిత్యకృత్యంగా మారాయి. పరిశ్రమలకు వారానికి రెండురోజులు రాత్రిపూట విద్యుత్తు సరఫరాను నిలిపేస్తున్నారు. దీంతో మూడో షిఫ్టును రద్దు చేసి పవర్ హాలిడే ఇవ్వాల్సి వస్తున్నదని పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాలూకా స్థాయిలో రోజుకు ఒక గంట (ఉదయం 7 నుంచి 8 గంటల వరకు) జిల్లా కేంద్రాల్లో రోజూ 2 గంటలు (ఉదయం 7 నుంచి 9 గంటల వరకు), మునిసిపాలిటీ కేంద్రాల్లో రోజుకు 3 గంటలతోపాటు 5 వేలకు మించిన జనాభా ఉన్న నగరాల్లోనూ రోజూ 3 గంటల (ఉదయం 6 నుంచి 9 గంటల వరకు)పాటు పవర్‌కట్ చేస్తున్నట్టు ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. జైపూర్, జోధ్‌పూర్, అజ్మీర్ లాంటి నగరాల్లో ఉదయం 7 నుంచి 8 గంటలవరకు అనధికారికంగా విద్యుత్తు కోతలు కొనసాగుతున్నాయి. వ్యవసాయానికి 6 గంటలకు బదులుగా 5 గంటలపాటే విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని పట్టణాలు, గ్రామాల్లోనూ విద్యుత్తు కోతలు నిత్యకృత్యంగా మారాయి. ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్తు కోతలు ఎప్పుడు విధిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది.

కర్ణాటకలో విద్యుత్తు కోతలు ఇలా..

ప్రాంతం (జిల్లాలు)	కోతలు (రోజుకు సగటున గంటలు)
బెళగావి డివిజన్ (7)	6-7 గంటలు
కలబురగి డివిజన్ (7)	4-5 గంటలు
మైసూరు డివిజన్ (8)	4 గంటలు
బెంగళూరు డివిజన్ (9)	3-4 గంటలు

తెలంగాణ విద్యుత్తు విజయం

అంశం	2014లో (యూనిట్లు)	2023లో (యూనిట్లు)	పెరుగుదల (%)
తలసరి విద్యుత్తు వినియోగం	1,196	2,166	79
స్థాపిత విద్యుత్తు సామర్థ్యం	7,778	18,756	141
గరిష్ఠ విద్యుత్తు డిమాండ్	6,700	15,497	131

తెలంగాణపై కన్ను!

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని చేపట్టగానే, కరెంటు సంక్షోభంలో ఉన్న కర్ణాటకకు తెలంగాణ నుంచి విద్యుత్తును సరఫరా చేసేలా కాంగ్రెస్ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. కర్ణాటకలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొన్నటివరకూ సాగుకు 5 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకే అష్టకష్టాలు పడ్డ కర్ణాటక ప్రభుత్వపెద్దలు.. మరికొద్ది రోజుల్లో కరెంటు కష్టాలు తీరబోతున్నట్టు ఇటీవల తరుచూ చెబుతున్నారు. ఒకవేళ, కర్ణాటకలో విద్యుదుత్పత్తి పెరిగిందా? అంటే అదీ లేదు. కర్ణాటకలోని ఐదు ప్రధాన విద్యుత్తు ఉపకేంద్రాల్లో విద్యుదుత్పాదన ఇటీవల దారుణంగా పతనమైంది. జిందాల్‌లో సున్నా ఉత్పత్తి నమోదవగా.. ఆర్టీపీఎస్ (రాయచూరు), బీటీపీఎస్ (బళ్లారి), వైటీపీఎస్ (యరమరాస్)లో ఉత్పత్తి బాగా క్షీణించింది. యూటీపీపీ(ఉడుపి)లో ఉత్పాదన అంతంత మాత్రమే. మొత్తంగా ఐదు కేంద్రాల్లో రోజూ 7,680 మెగావాట్ల ఉత్పత్తి జరగాలి. అయితే ప్రస్తుతం కేవలం 2045 మెగావాట్ల విద్యుదుత్పత్తి మాత్రమే జరుగుతున్నది. అలాగే 16 జలవిద్యుత్తు కేంద్రాల ద్వారా రోజూ 3,666.6 మెగావాట్లు విద్యుదత్పత్తి జరుగాల్సి ఉండగా, ప్రస్తుతం 205 మెగావాట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. మరోవిషయం ఏమిటంటే, మూడేండ్లకుగాను స్పెషల్ పవర్ టారిఫ్ ప్లాన్‌ను తీసుకొస్తున్నట్టు ఇటీవలే కర్ణాటక సర్కారు ప్రకటన చేసింది. తగినంత విద్యుత్తు సరఫరా ఉన్నప్పుడు.. కరెంటు బిల్లులపై వినియోగదారులకు కచ్చితమైన అవగాహన ఉండటానికే మల్టీ-ఇయర్-టారిఫ్స్ (ఎంవైటీ)ని తీసుకొస్తారు. అయితే, కర్ణాటకలో విద్యుత్తు కోతలు కొనసాగుతున్న ఈ సమయంలో ఎంవైటీని ప్రభుత్వం తీసుకురావడం అనుమానాలకు తావిస్తున్నది. గతంలో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ విషయంలో చేసినట్టుగానే, తెలంగాణ నుంచి కర్ణాటకకు విద్యుత్తును తీసుకుపోవడానికే కాంగ్రెస్ ప్లాన్‌ను సిద్ధంచేసిందని, అందుకనే, విద్యుత్తు సంక్షోభం తీరనున్నదంటూ కర్ణాటకలో కాంగ్రెస్‌పెద్దలు కచ్చితంగా చెబుతున్నట్టు విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదమరిచి కాంగ్రెస్‌కు ఓటేస్తే, వెలుగుల తెలంగాణ చీకట్లలో మగ్గాల్సిందేనని తెలంగాణవాదులు హెచ్చరిస్తున్నారు.

అది 2018 సంవత్సరం..

రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. ఇరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే, అప్పటికే రాజస్థాన్‌లో విపరీతమైన కరెంటు కోతలు. ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం మిగులు విద్యుత్తు ఉన్నది. దీంతో 2019లో ఇరురాష్ట్రాల మధ్య విద్యుత్తు సరఫరా ఒప్పందాన్ని కాంగ్రెస్ ముందుకు తెచ్చింది. తమ విద్యుత్తును తీసుకుపోవద్దని ఛత్తీస్‌గఢ్ హక్కుల కార్యకర్తలు ఎంత మొరపెట్టుకొన్నా వినలేదు. ఫలితం ఇప్పుడు రాజస్థాన్‌లోనే కాదు.. ఛత్తీస్‌గఢ్‌లోనూ తీవ్రమైన విద్యుత్తు సంక్షోభం నెలకొన్నది.

అది 2022 సంవత్సరం..

హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తాము అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో కరెంటు కోతలు ఇంకా కొనసాగుతుండటంతో.. ఈ ఏడాది ప్రథమార్థంలో హిమాచల్-రాజస్థాన్ మధ్య విద్యుత్తు సరఫరా ఒప్పందాన్ని కాంగ్రెస్ తెరమీదికి తెచ్చింది. రాజస్థాన్‌కు.. హిమాచల్ ప్రభుత్వం కరెంటు ఇవ్వడమే దీని ముఖ్యోద్దేశం. మూడు నెలలు గడిచాయి. ఇప్పుడు రాజస్థాన్‌లోనే కాదు.. హిమాచల్‌లోనూ కరెంటు కోతలు నిత్యకృత్యమయ్యాయి.

ప్రస్తుతం..

పొరుగురాష్ట్రం కర్ణాటక అసెంబ్లీకి ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ముంగిట కన్నడ ప్రజలకు ఐదు గ్యారెంటీలను మాటిచ్చిన కాంగ్రెస్.. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత ఆ హామీలను అమలు చేయలేక చతికిలపడింది. ఫలితంగా రాష్ట్రంలో గడిచిన ఆరునెలలుగా విద్యుత్తు సంక్షోభ మొదలైంది. కరెంటు లేక కటకటలాడుతున్నది. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. కర్ణాటక కన్నా ఒకటెక్కువగా ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ఇక్కడ ప్రచారం చేస్తున్నది. అయితే గత కొద్దిరోజులుగా విద్యుత్తుపై కాంగ్రెస్ స్వరంలో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నది. 'తెలంగాణకు 24గంటల కరెంటు ఎందుకు? 5 గంటల కరెంటుచాలు' అన్నట్టుగా కాంగ్రెస్ స్థానిక, కర్ణాటక, ఢిల్లీ నేతలు మాట్లాడుతున్నారు. మరి ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ఉదంతాలను, విద్యుత్తును గుంజుకపోయి ఆయా రాష్ట్రాల్లో చీకట్లను నింపిన ఒప్పందాలను ఈ సందర్భంగా విద్యుత్తురంగ నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఇక్కడినుంచి కరెంటును కర్ణాటకకు తరలించి, తెలంగాణను బలిపెట్టాలని కాంగ్రెస్ చూస్తున్నదా అని వారు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. అదే జరిగితే.. ఇప్పటివరకూ 24 గంటల విద్యుత్తు వెలుగులను చూసిన తెలంగాణ.. ఒక్క పొరపాటుతో రోజూ చీకట్లలో మగ్గాల్సిందేనని వారు హెచ్చరిస్తున్నారు.

మరో ఆరుగురు అధికారులపై వేటు

- **ప్రధాని పర్యటన భద్రతా వైఫల్యంపై చర్యలు**

న్యూఢిల్లీ, నవంబర్ 26: గత ఏడాది జనవరిలో ప్రధాని మోదీ పంజాబ్ పర్యటన సందర్భంగా చోటుచేసుకొన్న భద్రతా వైఫల్యం ఘటనకు సంబంధించి మరో ఆరుగురు పోలీస్ అధికారులపై ఆ రాష్ట్ర హోంశాఖ ఆదివారం వేటు వేసింది. తాజాగా సస్పెన్షన్‌కు గురైన వారిలో ఇద్దరు డీఎస్పీ ర్యాంకు అధికారులు పార్శన్ సింగ్, జగదీశ్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్ఐ, ఒక ఏఎస్ఐ ఉన్నారు. వీరితో సస్పెండ్ వేటు పడిన పోలీసు అధికారుల సంఖ్య ఏడుకు చేరింది. ఇప్పటికే ప్రస్తుతం బఠిండా జిల్లా ఎస్పీగా ఉన్న(అప్పటి ఫిరోజ్‌పూర్ ఎస్పీ) గుర్బిందర్ సింగ్‌ను శనివారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. పంజాబ్ డీజీపీ నివేదిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకొన్నది.

సియెర్రా లియోన్‌లో తిరుగుబాటుదారుల దాడి

సియెర్రా లియోన్, నవంబర్ 26: సియెర్రా లియోన్ రాజధాని ఫ్రీటౌన్‌పై సాయుధులైన తిరుగుబాటుదారులు ఆదివారం దాడి చేశారు. దేశ ప్రధాన మిలటరీ బ్యారెక్‌లు, నిర్బంధ కేంద్రాలు లక్ష్యంగా దాడులు చేసి వాటిలో బందీలుగా ఉన్న కొందరిని విడుదల చేయగా, మరికొందరిని అపహరించుకుని పోయారు. పడెంబా రోడ్ ప్రిజన్స్ సహా పలు కారాగారాల్లో రెండు వేల మందికి పైగా నిర్బంధంలో ఉన్నారు. ఈ దాడిలో సాయుధ తిరుగుబాటుదారులు చాలామందిని అపహరించుకుపోగా, మరికొందరు పరారయ్యారు. చాలామందిని భద్రతా బలగాలు రాజధాని శివారు, ఇతర ప్రాంతాల్లో తిరిగి అదుపులోకి తీసుకున్నట్టు ఆ దేశ సమాచార శాఖ మంత్రి చెర్నోర్ బా తెలిపారు. ఈ దాడుల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా కర్ఫ్యూ విధిస్తున్నట్టు ఆ దేశ అధ్యక్షుడు జూలియస్ మాడా బియో ప్రకటించారు.

ప్రేమను తిరస్కరించిందని యువతి దారుణ హత్య

కాన్పూర్, నవంబర్ 26: యూపీలో మరో దారుణం జరిగింది. తన ప్రేమను తిరస్కరించిందని కక్ష పెంచుకున్న 26 ఏండ్ల యువకుడు ఆదివారం ఒక యువతిని నరికి చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. బిల్హౌర్‌లోని గదన్‌పూర్ ఆహార్‌లో నివసించే సురేష్ అలియాస్ కరణ్ తన పొరుగున నివసించే 21 ఏండ్ల షన్నో కశ్యప్‌కు తన ప్రేమను ప్రతిపాదించాడు. దానిని ఆమె తిరస్కరించింది. దీంతో కక్ష పెంచుకున్న సురేష్ తన కజిన్, మేనల్లుడితో బైక్‌పై వస్తున్న షన్నోను రానా గ్రామం వద్ద ఉన్న ఫ్లైఓవర్ వద్ద ఆపి ఆమె మెడపై, తలపై, చేతులపై కత్తి, గొడ్డలితో విచక్షణా రహితంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సురేష్ కోసం గాలిస్తుండగా హత్యా ప్రదేశానికి 10 కిలోమీటర్ల దూరంలో అప స్మారక స్థితిలో కన్పించాడు. అప్పటికే విషం తాగి, నోటి నుంచి నురుగలు రావడం గమనించిన పోలీసులు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు.

సొంత కార్యకర్తలకే మొండి చెయ్యి

సభ్యత్వ నమోదు ప్రమాద బీమా రెన్యూవల్ చేయని కాంగ్రెస్

- గత మార్చి నెలలోనే గడువు ముగిసినా పట్టించుకోని పార్టీ
- కార్యకర్తల కోసం కేవలం రూ.6 కోట్లు చెల్లించలేని దైన్యం
- రెన్యూవల్ చేయకపోవడంతో బీమా చెల్లింపునకు కంపెనీలు నో
- చనిపోయిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అందని పరిహారం
- కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్.. నెల క్రితమే 26 కోట్ల బీమా
- 5 వేల మంది కార్యకర్తల కుటుంబాలకు 100 కోట్ల బీమా

ఏ పార్టీకైనా కార్యకర్తలే బలం, బలగం. అలాంటి కార్యకర్తలను ఏ పార్టీ అయినా కంటికి రెప్పలా కాపాడుకోవాలి. కానీ కాంగ్రెస్ పార్టీ ఇందుకు విరుద్ధం. సొంత పార్టీ కార్యకర్తలనే రోడ్డుపాలు చేస్తున్నది. వారి కోసం కనీసం ప్రమాద బీమా కూడా చెల్లించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఆ పార్టీ ఉన్నది. దీంతో పార్టీ కోసం పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ తన కార్యకర్తలను కంటికిరెప్పలా కాచుకొంటున్నది. నెల క్రితమే 26 కోట్ల బీమాను చెల్లించి కార్యకర్తలకు భీమా ఇచ్చింది. ఇప్పటివరకూ 5 వేల మంది కార్యకర్తల కుటుంబాలకు 100 కోట్ల బీమా సాయం అందజేసి, కార్యకర్తల కుటుంబాలకు తానున్నాననే భరోసా కల్పించింది.

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ 2022-23కు సంబంధించి సభ్యత్వ నమోదులో భాగంగా కార్యకర్తలకు రూ.2 లక్షల ప్రమాద బీమాను కల్పించింది. సభ్యత్వ నమోదు చేసుకొన్న సుమారు 40 లక్షల మంది కార్యకర్తల కోసం రూ.6 కోట్ల వరకు బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించింది. అయితే ఈ ప్రీమియం గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగిసింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి పార్టీ తరపున రెన్యూవల్ చేయాల్సి ఉన్నది. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ పాలసీని రెన్యూవల్ చేయకుండా వదిలేసింది. దీంతో బీమా కంపెనీలు కార్యకర్తల కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు నిరాకరిస్తున్నాయి.

కార్యకర్తల కోసం కోట్లు దండగ చేస్తమా?

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 2021 డిసెంబర్ 9న ఇక్కడ డిజిటల్ సభ్యత్వాన్ని నమోదు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి స్థానంలో గతంలో ఎప్పుడూ లేనంతగా పార్టీ సభ్యత్వాన్ని చేయించాలని నిర్ణయించారు. తద్వారా అధిష్ఠానం వద్ద మార్కులు కొట్టేయాలని ప్రయత్నించారు. టార్గెట్ పెట్టి మరీ సభ్యత్వ నమోదు చేయించారు. ఆ తర్వాత చేతులు దులుపేసుకున్నారు. సభ్యత్వ నమోదు సమయంలో కార్యకర్తలపై చూపిన ప్రేమ.. ఆ కార్యకర్త చనిపోయాక అతడి కుటుంబంపై చూపడం లేదు. పాలసీ రెన్యూవల్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినా దాన్ని పట్టించుకోలేదని తెలిసింది. 'ఇప్పుడు అదేం అవసరం లేదులే... అనవసరంగా కోట్లు దండుగ చేసుడెందుకు?' అని రేవంత్ అన్నట్టు సమాచారం.

కార్యకర్తల కుటుంబాలు రోడ్డుపాలు

కాంగ్రెస్ పార్టీ ఎంతో గొప్పగా కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేసింది. ప్రమాదంలో చనిపోతే రూ. 2 లక్షల బీమా వస్తుందంటూ నమ్మించింది. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలు పార్టీ ఇచ్చిన ఐడీ కార్డులతో బీమా కంపెనీని ఆశ్రయించగా, వారికి నిరాశే ఎదురవుతున్నది. బీమా సొమ్ము ఇచ్చేందుకు కంపెనీలు నిరాకరిస్తున్నాయి. పాలసీ గడువు ముగిసిందని, పార్టీ రెన్యూవల్ చేయలేదని, తాము పరిహారం చెల్లించలేమని ముఖం మీదనే చెప్పేస్తున్నాయి. దీంతో ఆ కుటుంబాలకు బీమా సొమ్ము దక్కడం లేదు. పార్టీకోసం శ్రమిస్తూ ప్రాణాలు పోయిన కార్యకర్తల కుటుంబాలు ఇప్పుడు రోడ్డుపాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనిపై కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం తాము ప్రాణాలకు లెక్క చేయకుండా పనిచేస్తుంటే.. పార్టీ మాత్రం తమను కనీసం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పార్టీ కోసం తామెందుకు కష్టపడాలని, ప్రాణాలు ఎందుకు అర్పించాలని ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం ప్రాణాలిచ్చి.. తమ కుటుంబాలను నాశనం చేసుకోవాల్నా? అని నిలదీస్తున్నారు.

కంటికిరెప్పలా కాపాడుకొంటున్న బీఆర్ఎస్

కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలను, వారి కుటుంబాలను రోడ్డుపాలు చేస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం తన కార్యకర్తలను అక్కున చేర్చుకొంటున్నది. కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అన్నీ తానై వ్యవహరిస్తున్నది. మరీ ముఖ్యంగా కార్యకర్తల ప్రమాద బీమా అంశంపై పార్టీ నిక్కచ్చిగా ఉంటున్నది. పాలసీ గడువు ముగియగానే రెన్యూవల్ చేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నది. ఇందులో భాగంగానే 2023-24 సంవత్సరానికిగానూ సెప్టెంబర్ 16వ తేదీన రూ.26 కోట్ల ప్రీమియం చెల్లించింది. తద్వారా సుమారు 60 లక్షల మంది కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నది. ఇదిలా ఉంటే పార్టీ చెల్లించిన ప్రమాద బీమా ద్వారా 5 వేల మంది కార్యకర్తల కుటుంబాలకు ఊరట లభించింది. ప్రమాదంలో చనిపోయిన ఆ కార్యకర్తల కుటుంబాలకు రూ.100 కోట్ల పరిహారాన్ని చెల్లించింది. ఇంత పెద్ద మొత్తంలో కార్యకర్తల కుటుంబాలకు పరిహారం చెల్లించిన పార్టీ ఒక్క బీఆర్ఎస్ మాత్రమే కావడం విశేషం.

- **కార్యకర్తలకు బీఆర్ఎస్ బీమా**

కార్యకర్తలకు బీమా కోసం యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు ప్రీమియం చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ (ఫైల్ ఫొటో)

రాహుల్.. మా క్విజ్ బహుమతులేవి?

- కాంగ్రెస్ అగ్రనేతను నిలదీస్తున్న తెలంగాణ యువత
- క్విజ్‌లో గెలిస్తే ల్యాప్‌ట్యాప్‌లు, ఫోన్లు, ట్యాబ్‌లు, ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని హామీ
- ఆర్నెల్ల కిందటే పరీక్షలు.. విడుదల కాని ఫలితాలు
- రాజీవ్ యూత్ క్విజ్ పేరుతో యువతకు కాంగ్రెస్ ధోకా

రాహుల్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాహుల్‌గాంధీ (ఫైల్)

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): యూత్ డిక్లరేషన్, ఉద్యోగ క్యాలండర్ పేరుతో హడావిడి చేస్తున్న కాంగ్రెస్ అసలు రూపం బట్టబయలైంది. ఆ పార్టీ కపట ప్రేమ కండ్ల ముందే కనిపిస్తున్నది. యువతను ఆకట్టుకునేందుకు జూన్ 18న రాజీవ్‌గాంధీ యూత్ క్విజ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోటీలను నిర్వహించింది. ప్రతి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువతను ఎన్‌రోల్ చేయించింది. విజేతలుగా నిలిచిన వారికి ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు, స్మార్ట్ వాచ్‌లు ఇస్తామని ప్రకటించింది. మహిళా టాపర్లకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని గొప్పగా చెప్పుకొచ్చింది. ఈ క్విజ్ పోస్టర్‌ను రాహుల్‌గాంధీ రిలీజ్ చేశారు. అన్ని నియోజకవర్గాల్లో గ్రాండ్‌గా పరీక్షను నిర్వహించింది. 4 లక్షల మంది యువత పాల్గొన్నారు. తీరా పరీక్షలు నిర్వహించి ఆర్నెల్లు గడుస్తున్నా ఫలితాలకు అతీగతి లేదు. ఇస్తామన్న బహుమతులకు దిక్కులేదు. దీంతో పరీక్ష రాసినవారు ఫలితాలేవి? బహుమతులేవి? అని స్థాన